# అసహజం

- నిడదవోలు మాలతి

తను "చదువుకున్నది". తను చదువుతోంది. తన నడతలో, నడకలో, మాటలో నీటులో తను "చదువుకున్నది". మనిషికీ మృగానికీ - చదువుకున్నవాళ్లకీ చదువుకోనివాళ్లకీ మధ్య- గల భేదం తనలో స్పష్టంగా ప్రతిబింబోస్తోందని తన అభిప్రాయం. తనకి అభిప్రాయాలు వున్నాయి. సర్వమానవసౌభ్రాతృత్వంమీద నమ్మకం వుంది. జీవితం అంటే నిర్దుష్టమైన నిర్వచనం వుంది. తను మాట తూలదు. ఎవరైనా మాట తూలితే సహిస్తుంది. మనిషికి మేధస్సుంది కనక మనిషి అసందర్భంగా, అసంబద్ధంగా అప్రాకృతంగా మాటాడవలసిన అవుసరం లేదు అని తన అభిప్రాయం.

సాన పట్టనిదే వజ్రమైనా ప్రకాశించదు కనక, పందిరి లేనిదే లతల ననలుతొడగవు కనక, బంగారప్పళ్లెరానికైనా గోడ చేరుపు అవసరం కనక, ప్రతిమనిషీ మనిషి కావడానికి ప్రాథమికవిద్య అవసరం. అందుకనే విద్యలేని పనిపిల్ల అమాయకంగా మాటాడినప్పుడు తనకి జాలి వేస్తుంది. దానికి లాజికల్‌గా మాటాడడం నేర్పాలని తను పాటుపడింది కాని ఆ యత్నం ఫలవంతం కాలేదు.. దానికి కారణం సామాజికవ్యవస్థలో రావలసిన మార్పు ఇంకో రెండు తరాల దాకా రాదు అని తెలిసిపోయింది తనకి. అంచేత తను అపనిపిల్లకి అక్షరజ్ఞానం కలిగించే ఉద్దేశానికి ఉద్వాసన చెప్పింది. కాని ఆపనిమనిషి ఎంత పనికిరాని మనిషో తెలియజెప్పవలసిన రోజు వచ్చింది ఓరోజున. తను స్వచ్ఛమైన తెలుగులో "తూర్పోళ్ల యాస"తో సహా చెప్పినా అపిల్ల అర్థం చేసుకోలేదని ఋజువు చేసుకునే దినం ఆసన్నమయింది.

ఆఫలానారోజున కాలేజీలో ఒకసభ జరగబోతోంది. అన్నిసభల్లా రెండు పూలకుండీలూ, ఒక టేబులు క్లాతూ, మూడు పూలమాలలూ ఉంటే తప్ప జరగని సభ అది. కాలేజినిర్వాహకవర్గం అదృష్టవశాత్తు లేక స్వశక్తిసామర్థ్యాలవల్ల అన్నీ సేకరించగలిగారు కానీ పూలకుండీలు దొరకలేదు. ఆరెండు అమూల్యమైన వస్తువులకొరకూ విశాలమైన ఆమహా పట్టణంలో వెతుక్కుంటూ తిరిగే టైము లేదు కనక, అన్నిటికంటె దగ్గరలో అందుబాటులో తన ఇంటిలోనే లభ్యం కనక తనఇంటికి జాయింట్ సెక్రటరీ దాసు వచ్చేడు.

తను కూడా ఆసభకి హాజరు అయి సభని జయప్రదం గావిస్తే బాగుంటుందని కూడా సూచించేడతను. అంత మర్యాదగానూ అసమ్మతిని తెలియజేసింది తను. నిజానికి తనకి మనసులో రావాలనే వుంది కానీ వొంట్లో బాగులేదు. చాలా విచారించదగ్గవిషయం. పూలకుండీలు మాత్రం సంతోషపూర్వకంగా ఆసభకి అప్పివ్వగలదు. కాని తనదగ్గరున్నవి ఇత్తడివి. చింతపండుతో తోమి, బ్రాసోతో పాలిష్ పెడితే తప్ప అవి రాణించవు. తనపూలకుండీలకి పూర్తిగా న్యాయం చేకూర్చడం విషయంలో సహజంగా సంపూర్ణాంగీకారం తెలిపాడు ఆజాయింట్ సెక్రటరీ. పదినిముషాల కాలాన్ని వెచ్చించడానికి అతడు సిద్ధమే.

అంతసేపు అతను నించోడం తనమర్యాదకే భంగం. చాలా బలవంతం చేస్తే తప్ప అతను కూచోడానికి సమ్మతించలేదు. అతను చాలా మర్యాదస్తుడిలా కనిపించాడు తనకి. ఒక కప్పు కాఫీ ఇస్తే బాగుంటుందని కూడా తట్టింది. అక్కడ మొదలయింది వచ్చిన చిక్కంతా.

కాఫీ పెట్టడానికి ఇంట్లో పాలు నిండుకున్నాయి. తను అంత తొందరపడి ఆసదుద్దేశాన్ని అతనితో చెప్పకపోతే, ఆమానవుడు వద్దు వద్దని ఎంత మొత్తుకుంటున్నా తను వినకుండా, నో, నో, యూ మస్ట్ టేకంటూ అనకపోతే తనీ చిక్కులో ఇరుక్కోకపోను. కాని జరిగివుండవలసినదాన్నిగురించి వగచి ఏంప్రయోజనం? పెరటిదారిన అతిదగ్గరగా వున్న అయ్యరుహోటేలుకి పనిపిల్లని పంపడం తప్ప చేయగలిగిందేముంది?

పనిమనిషి కాఫీతో వచ్చేవరకూ అతన్ని ఊరికే కూచోపెట్టడం బాగుండదు కనక సంభాషణకి ఉపక్రమించింది. దాసుకి మనసు సంభాషణమీద కాక కాలేజీలో సభాంతరాళమందు ఇంకను జరగవలసిన పనులమీదున్న కారణాన తనొక్కతే మాటలాడుతున్నందున అయిదు నిముషాల్లోనే అన్ని సబ్జెక్టులూ సర్వే అయిపోయేయి. లోపల్నుంచి కాఫీ మటుకు రాలేదు.

తనే మళ్లీ ప్రస్తావన మొదలెట్టింది. "మనుషుల్లో ఎంతటి చిత్రమైనవాళ్లు ఉంటారో. మాసర్వెంటు మెయిడుకి వున్న మొండితనమూ, తలతిక్కా, కృత్రిమనాగరికతా, కుతర్కమూ చూస్తే భూమండలం అంతా వెతికినా మళ్లీ దానిలాటిది దొరుకుతుందనుకోను. ఏదైనా చెప్తే అర్థం చేసుకో నిరాకరిస్తుందంతే. ఆమనిషి త్వం ఆలోచించండి. సరిగ్గా ప్రతిరోజు నేను పొద్దున్నే చదువుకోడానికి కూర్చున్నక్షణాలే స్నానానికి నీళ్లు సిద్ధం చేస్తుంది. సాయంత్రంవేళ సరీగ్గా నా బాటనీ రికార్డులు ముందేసుక్కూర్చునేవేళకి చీపురు పట్టుకు తయారవుతుంది ఊడుస్తానంటూ. సవాలక్షసార్లు చెప్పాను ఎవరైనా వచ్చినప్పుడు చీపురుకట్టొకచేతా మాసిన అట్ట మరోచేతా పట్టుకు

తయారవొద్దని. కాని ఆఅవతారంలో దర్శనమివ్వడం సరదాయేమో దానికి ..."

దాసు ఏదైనా అనకపోతే బాగుండుదన్నట్టు, "బహుశా చుట్టాలొచ్చేవేళా, మీగది శుభ్రపరిచేవేళా అనుకోకుండా కలుస్తాయేమో," అన్నాడు.

తన ఊహకి ఆపాయింటు అందలేదు. "వచ్చినచుట్టాలు వెళ్లేవరకూ ఆగలేదూ?"

"దానికి ఇంట్లో మరే పని ఉండదా?" అన్న ప్రశ్న తట్టింది కాని దాసు ప్రశ్నించలేదు.

"ఏదైనా చిన్నపని దానిచేత చేయించాలంటే ఎక్స్ట్రా పే చెయ్యాలి."

దాసు మరొకసారి నిందితురాలిని బలపరిచే ప్రయత్నం చేయకుండా ఉండలేకపోయాడు. "డబ్బుకి చాలా ఇబ్బంది పడుతోందేమో."

"ఓహ్, నాన్సెన్స్" అనేసి నాలుక్కరుచుకుంది తను.

దాసు వీధిగుమ్మంవేపూ, గోడగడియారంవేపూ మార్చి మార్చి చూశాడు. మీటింగు అయిదు గంటలకి మొదలు పెట్టాలి. నిర్ణీతసమయాన్ననుసరించి.

గోడమీద గడియారం అయిదుగంటలు కొట్టింది.

తనకి హఠాత్తుగా తట్టింది ఒక క్లాస్మేట్తో మాటాడడానికి "మా పనిమిషి" అనే విషయం ఏమంత మెచ్చతగ్గవిషయం కాదని. సిగ్గుతో మొహం కందిపోయింది.

"అమ్మగారూ" అంటూ లోపల్నించి కీచుగొంతు వినిపించింది. ఆస్వరానికి ఇద్దరూ--వేరు వేరు కారణాలకే అయినా-- త్రుళ్లిపడ్డారు.. తను లేచి ఆపనిపిల్ల అలా అసహ్యంగా అరిచినందుకు బుద్ధి చెప్పడానికీ, కాఫీ తేవడానికీ లోపలికి వెళ్లింది. ఆపిల్ల ఫ్లాస్క్ అందిస్తూ,, తడబడుతూ, వగరుస్తూ చెప్పింది- దగ్గర్లో వున్న మూడు హోటళ్లకీ ఆశుభదినాన శలవనీ, నాలుగో అతిదగ్గర హోటలు వూరికి రెండోచివర వుందనీ. దానికి వున్న ఒక్కగుండెతోనూ అమ్మగారి ఆజ్ఞకి విరుద్ధంగా రిక్తహస్తాలతో రావడం అసాధ్యం.

తను దాని కంఠస్వరంవిషయంలో ఒకటి రెండు మాటలు అని, రెండుకప్పులలో కాఫీతో డ్రాయింగురూములోకి వచ్చింది. మందహాసం చేస్తూ ఆలస్యానికి క్షమిస్తారనుకుంటానంది.

దాసు మొహమ్మీద పెచ్చులూడిన పాతగోడలాటి నవ్వొకటి విరిసి మాయమయింది. ఒక్కగుక్కలో కప్పు కాఫీ నోట్లో పోసుకుని, ఆతిథ్యానికి కృతజ్ఞతలు చెప్పి రేస్లో రన్నర్లా గుమ్మం దాటేడు.

ఆతరవాతిక్షణంలో చిన్నరకం దొమ్మీ అయినట్టి, "ఆహ్", "ఇదేమిటి", "నువ్వు" "నువ్వు" వంటి రకరకాల శబ్దాలన్నీ కలిసికట్టుగా వినిపింటాయి. తను కళ్లు గట్టిగా మూసుకుంది. రెండు చేతులూ రెంటూ చెవుల్నీ పరిరక్షించాయి. ఒక్క నిముషంసేపు అలా నిలబడిపోయింది స్థాణువై. తనచెవుల్ని తను నమ్మగలిగితే, "నువ్వు ఇక్కడికెందుకు వచ్చావు" అని అడుగుతున్న మనిషి తన దాసి.

"నువ్విక్కడ పని చేస్తున్నావా?" అని అడుగుతున్న మనిషి జాయింట్ సెక్రటరీ దాసు.

మూడోనిముషంలో తను గుమ్మందగ్గిరికి వచ్చేవేళకి కిందపడిన పనిమనిషిని లేవదాసే ప్రయత్నంలో వున్నాడు "అది" పగిలినగాజు పెంకులు ఏరే ప్రయత్నంలో వుంది. దాసు కూడా గాజుపెంకులు ఏరుతున్నాడు వంగి.

"హే భగవాన్, అరెరె మీకెందుకు శ్రమ. అది తీస్తుందిలెండి. నేచెప్పలేదూ దాని పొగరు. గాని మీకు లెలుసులా ఉంది ఈమనిషిని."

దాసు గాజుపెంకులు అన్నీ తీసేసినట్టు పూర్తిగా నమ్మకం కుదిరాక, మెల్లిగా తలెత్తి, "తెలుసు. అది నాచెల్లెలు" అన్నాడు.

తను గతుక్కుమంది. కాలేజీలో సర్వసాధారణంగా తనక్లాసుమేట్సు ఎందుకు అతనిచేత బెంచీలు మోయిస్తారో సార్థకనామధేయుడని ఎందుకు అవహేళన చేస్తారో ఇప్పుడు పూర్తిగా అర్థమయింది.

మర్నాడు ఆ అమ్మాయి పనిలోకి రాలేదు. తను ఎదురు చూసినట్టు జీతండబ్బులకోసమూ రాలేదు. ఆసాయంత్రం దాసు మామూలుగా పూలకుండీలు ఇచ్చేయడానికి వస్తే కూచోమని చెప్పడానికి తను నేర్చుకున్న విద్యలన్నీ, తననాగరికత అంతా, సంస్కృతి అంతా, తన మేనర్స్ అన్నీ కలిసి తనచేత ఒక పలుకు పలికించలేకపోయాయి. అతని చెల్లెలికివ్వవలసిన రెండురూపాయలూ అతనికి ఇవ్వాలో ఇవ్వకూడదో తను నేర్చుకున్న సభ్యత చెప్పలేదు.

దాసు కృతజ్ఞతలు చెప్పి వెళ్లిపోయాడు.

తరవాత దాసు కాలేజీలో కనిపించినప్పుడు మీరు అనలేకపోయింది. నువ్వు అనేధైర్యం లేకపోయింది.

కథ అసహజంగా ఆగిపోయింది.

(1952-53 ప్రాంతాల్లో విశాఖవాసులు మసూనా (మండా సూర్యనారాయణగారు) కొంతకాలం నడిపిన విశ్వవీణ పత్రికలో ప్రచురింపబడింది). 000